క్లుప్తంగా

నేడు మండల మీట్

బి.కొత్తకోట : మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఉదయం 11 గంటలకు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శంకరయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ లక్ష్మినరసమ్మ అధ్యక్షతన జరిగే సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచులు, మండల స్థాయి అధికారులు హాజరుకావాలని కోరారు.

ములకలచెరువు సీఐగా మధు



ములకలచెరువు: ములకలచెరువు సీఐగా టి.మధును నియమిస్తూ కర్నూలు డీఐజీ సెంథిల్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. సత్యసాయి జిల్లా కదిరి సీఐగా పనిచేస్తున్న ఆయన వీఆర్‌కు బదిలీ అయ్యారు. అక్కడి నుంచి ములకలచెరువు సీఐగా బదిలీ అయ్యారు. ఇక్కడ పనిచేస్తున్న సీఐ సాధిక్‌అలీ రాయచోటి టాస్క్‌ఫోర్స్‌కు బదిలీ అయ్యారు.

విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్రకార్యదర్శిగా సురేంద్రరెడ్డి



కలికిరి : విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్రకార్యదర్శిగా కలికిరికి చెందిన సి. సురేంద్రరెడ్డి ఎంపిక య్యారు. కాకినాడలోని సూర్యకళామందిర్‌లో సోమవారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి విశ్రాంత ఉద్యోగుల సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఆ సంఘం నేత రామారాయుడు ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు. నూతన కార్యవర్గం మూడేళ్ల కాలపరిమితితో పనిచేస్తుందని, విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేయనున్నట్లు నూతన రాష్ట్ర కార్యదర్శి తెలిపారు.

రెడ్డి కమ్యూనిటీ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు

మదనపల్లె : రెడ్డి కమ్యూనిటీలో ఉన్న పేదవారిని ఆదుకునేందుకు పలు సేవాకార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించినట్లు సొసైటీ రాష్ట్ర అధ్యక్షులు సురేంద్రరెడ్డి, నాయకులు శ్రీధర్‌రెడ్డి, హనుమంతురెడ్డి తెలిపారు. మంగళవారం సేవాకార్యక్రమాలకు సహకరించాల్సిందిగా పట్టణంలోని పలువురు రెడ్డి కమ్యూనిటీ ప్రముఖులను కలిశారు. రెడ్ల ఘన చరిత్ర పుస్తకాలను అందించి, జాతి ఐక్యతకు, సంక్షేమానికి కృషి చేయాల్సిందిగా కోరారు. సేవాకార్యక్రమాలకు చేయూతను ఇవ్వాల్సిందిగా అభ్యర్థించారు. బీజేపీ నాయకులు చల్లపల్లె నరసింహారెడ్డి సంపూర్ణ మద్దతు తెలపడంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మధుకర్‌రెడ్డి, వెంకటరమణారెడ్డి, హేమంత్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, పద్మప్రియారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వాహనాలకు రికార్డులు తప్పనిసరి

కలికిరి : వాహనాలకు రికార్డులు తప్పనిసరిగా కలిగి ఉండాలని ఎస్‌ఐ కె.రహీముల్లా అన్నారు. కలికిరి పట్టణ పరిధిలోని ఆటో, ట్యాక్సీ డ్రైవర్లతో స్థానిక గ్రామదేవత ఎల్లమ్మ ఆలయ ఆవరణలో సమావేశం ఏర్పాటు చేసిన ఆయన మాట్లాడుతూ వాహన డ్రైవర్లు వాహన రికార్డులు, డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, ప్రజలతో మర్యాదగా మసలుకోవాలని సూచించారు. అపరిచిత, అనుమానిత వ్యక్తులు తారసపడితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో పీసీలు పాల్గొన్నారు.

గుర్రప్పస్వామి విగ్రహ ప్రతిష్ట



గుర్రప్పస్వామి మూల విగ్రహం

కలికిరి : మండలంలోని కలికిరి గ్రామ పంచాయతీ కె.రెడ్డివారిపల్లి గ్రామం కె.కొత్తపల్లిలో నూతనంగా నిర్మించిన ఆలయంలో సోమవారం రాత్రి భక్తిశ్రద్ధలతో గుర్రప్పస్వామి విగ్రహ ప్రాణ ప్రతిష్ట చేశారు. ఈ సందర్భంగా ఆలయ ఆవరణలో అర్చకుల వేదమంత్రోచ్చారణల మధ్య హోమం, కళశ స్థాపన, అభిషేకం నిర్వహించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

వాల్మీకిపురం : మండలంలో బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ యస్.కె. జాకీర్ హుస్సేన్ మంగళవారం తెలిపారు. మండలంలోని ఎస్‌హెచ్ 71 రోడ్డు విస్తర్ణ పనులలో భాగంగా ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. మండలంలోని గండబోయనపల్లి, చింతపర్తి, మంచూరు, నగరిమడుగు, కూరపర్తి సబ్ స్టేషన్ పరిధిలో కూడా విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

రోడ్డు నిర్మాణానికి భూమి పూజ

రామసముద్రం: మండల పరిధిలోని ఆర్.నడింపల్లె పంచాయతీకి రోడ్లకు మహర్దశ వచ్చినట్లు జెడ్పీటీసీ రామచంద్రారెడ్డి తెలిపారు. మంగళవారం ఆర్.నడింపల్లి పంచాయతీలోని బల్లసముద్రంరోడ్డు నుంచి కొండవార కొత్త ఇండ్లు వరకు 1.3 కిమీ, చెంబకూరు రోడ్డు నుంచి దిగువబొంపల్లికి సుమారు 800 మీ, అలాగే చెంబకూరు రోడ్డు నుంచి రాగిమాను గడ్డ వరకు రోడ్లు మంజూరయ్యాయి. ఆ రోడ్లకు జెడ్పీటీసీ రామచంద్రారెడ్డి , సర్పంచ్ ఆదినారాయణ, ఎంపీటీసీ రెడ్డిశేఖర్ చేతులు మీదుగా భూమిపూజ చేశారు.

అభివృద్ధిలో నగర పంచాయతీ పరుగులు

- రూ.60–70 కోట్లతో శాశ్వత తాగునీటికి ప్రణాళిక
- అమృత్ పథకం కింద రూ.5.11 కోట్లు మంజూరు
- పెద్దచెరువు సుందరీకరణకు రూ.2 కోట్లు
- మరో రూ.2 కోట్లతో కాలువలు, రోడ్ల పనులు

ఫ్యాక్ట్ చెక్



బి.కొత్తకోట... అధ్వాన బాట

ఈనాడు కథనం



బి.కొత్తకోట ఇందిరమ్మ కాలనీలో నిర్మించిన సిమెంటురోడ్డు

బి.కొత్తకోట : నగర పంచాయతీ అభివృద్ధి ప్రణాళికాబద్ధంగా అమలవుతోంది. బి.కొత్తకోటను సుందరమైన పట్టణంగా తీర్చిదిద్ది, ప్రజల సమస్యలను శాశ్వతంగా పరిష్కరించాలన్న లక్ష్యంతో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి మున్సిపల్‌శాఖకు అభివృద్ధి ప్రతిపాదనలతో ప్రభుత్వానికి విన్నవించారు. దీనిపై ఇప్పటికే నిధులు మంజూరవగా, మరిన్ని నిధుల కోసం ప్రణాళికలు సిద్ధం చేశారు. వచ్చే 30 ఏళ్ల దాకా ప్రజలకు తాగునీటిని ఎలాంటి సమస్యలు ఉండకూడదన్న లక్ష్యంతో రూ.60–70 కోట్లతో ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేయగా దీనిపై అధ్యయనం చేసే బాధ్యతలను ఓ కన్సల్టెన్సీ సంస్థకు అప్పగించారు. ఈ ప్రణాళికతో శాశ్వత తాగునీటి సమస్య పరిష్కారం కోసం కానుగలకుంట చెరువు లేదా బి.కొత్తకోటకు నాలుగు కిలోమీటర్ల దూరంలోని గుమ్మసముద్రం చెరువును సమ్మర్ స్టోరేజీ ట్యాంకుగా మార్చేందుకు చర్యలు తీసుకోనున్నారు. నీటిశుద్ధీకరణ ప్లాంట్ల ద్వారా శుద్ధి చేసిన నీటిని పైప్‌లైన్ ద్వారా పట్టణంలోకి తరలించి ప్రజలకు కొళాయిల ద్వారా సరఫరా చేస్తారు. భవిష్యత్‌లో తాగునీటి బోర్లపై ఆధారపడకుండా పెరిగే జనాభాకు అనుగుణంగా పనులు చేస్తారు.

రూ.5.11 కోట్ల నీటి సరఫరా పనులు :

అమృత్ పథకం కింద లక్షలోపు జనాభా కలిగిన మున్సిపాలిటీలకు నిధుల మంజూరులో భాగంగా బి.కొత్తకోటకు 5.11 కోట్లు మంజూరయ్యాయి. ఈ నిధులతో 3,500 గృహలకు తాగునీటి కొళాయిలు ఇచ్చే విధంగా పనులు చేపట్టనున్నారు. దీనికోసం సంతబజారులో తొమ్మిది లక్షల లీటర్ల నీటి నిల్వ సామర్థ్యం కలిగిన ఓహెచ్‌ఆర్‌ఎస్ ట్యాంకును నిర్మిస్తారు. ఇక్కడి నాలుగు బోర్ల నుంచి నీటిని ఒకచోట నింపి సరఫరా చేసేందుకు వీలుగా 60 వేల లీటర్ల సామర్థ్యంతో సంపు నిర్మిస్తారు. సంత బజారు, బీసీకాలనీ పరిసర ప్రాంతాల్లో కొళాయిలు ఇచ్చేందుకు కొత్తగా 3.6 కిలోమీటర్ల తాగునీటి పైప్ లైన్ నిర్మిస్తారు. దీనికోసం హెచ్‌డీపీఈ పైపులను వినియోగిస్తారు.

రూ.2 కోట్లతో సుందరీకరణ :

స్థానిక పెద్దచెరువు సుందరీకరణ పనుల కోసం అమృత్ 2.0 పథకం కింద రూ.2 కోట్లు మంజూరయ్యాయి. ఈ నిధులతో చెరువులోకి మురికినీరు చేరకుండా డ్రైనేజీ డైవర్షన్ పనులు చేపట్టి పట్టణం నుంచి వస్తున్న మురికినీటిని మళ్లిస్తారు. డ్రైనేజీ నీటిని శుద్ధి చేసే ప్లాంటును ఏర్పాటు చేస్తారు. చెరువుకట్టపై పార్కు, వాకింగ్ ట్రాక్, ఇతరా పనులు చేపట్టి సుందరంగా తీర్చదిద్దనున్నారు.

వేగంగా అభివృద్ధి పనులు :

నగర పంచాయతీ పరిధిలో రూ.2 కోట్లతో అభివృద్ధి పనులు సాగుతున్నాయి. రాజంపేట ఎంపీ మిథున్ రెడ్డి మంజూరు చేసిన రూ.50 లక్షల ఎంపీల్యాడ్స్ నిధులతో రోడ్లు, కాలువలు నిర్మిస్తున్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా మంజూరైన రూ.కోటితో రోడ్లు, మురికినీటి కాలువ పనులు జరుగుతున్నాయి. 15వ ఆర్థిక సంఘం కింద మంజూరైన రూ.50 లక్షల నిధులతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టగా అందులో రూ.10 లక్షలతో డస్ట్‌బిన్లను కొనుగోలు చేసి కుటుంబాలకు పంపిణీ చేశారు. కాగా రెగ్యులర్ కమిషనర్‌గా మనోహర్‌ను నియమించడంతో పాలనాపరమైన సమస్యలు తొలగిపోయాయి. నగర పంచాయతీ అభివృద్ధి, సమస్యలపైనే పూర్తి స్థాయిలో దృష్టిని కేంద్రీకరిస్తున్నారు.

అభివృద్ధి లక్ష్యంతోనే అప్‌గ్రేడ్



బి.కొత్తకోట పట్టణంగా అభివృద్ధి చెందేందుకు మంచి అవకాశాలు ఉన్నాయని గుర్తించే నగర పంచాయతీ చేశాం. ప్రజలకు సమీప భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సమగ్ర ప్రణాళికలతో అభివృద్ధి పనులు చేపట్టాలని నిర్ణయించి చర్యలు తీసుకుంటున్నాం. తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించడం, మురికినీటి కాలువలు, సిమెంట్‌రోడ్లు పూర్తిస్థాయిలో నిర్మించాలని ప్రణాళిక సిద్ధం చేశాం. – పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, ఎమ్మెల్యే

అభివృద్ధిపైనే దృష్టి



నగర పంచాయతీలో పాలనాపరమైన ఇబ్బందులు తొలగిపోయాయి. ప్రజల సమస్యల పరిష్కారం, అభివృద్ధిపైనే పూర్తిస్థాయిలో దృష్టిసారించాం. మురుగునీటి కాలువలు, సిమెంటురోడ్ల నిర్మాణాలు ప్రాధ్యాన క్రమంలో జరుగుతున్నాయి. అమృత్ పథకాల కింద మంజూరైన రూ.7.11 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టి సత్వరమే పూర్తి చేయించేలా చర్యలు తీసుకుంటున్నాం. మౌలిక వసతుల కల్పన కోసం చర్యలు తీసుకోవడం నిరంతర ప్రక్రియ. – పి.ఆర్.మనోహర్, కమిషనర్

గ్రామాల్లో పారిశుధ్యంపై దృష్టి సారించాలి

డివిజనల్ అభివృద్ధి అధికారి లక్ష్మీపతి



మాట్లాడుతున్న డివిజనల్ అభివృద్ధి అధికారి లక్ష్మీపతి

వాల్మీకిపురం : వర్షాకాలన్ని దృష్టిలో పెట్టుకుని గ్రామాల్లో పారిశుధ్యంపై గ్రామ పంచాయతీ సిబ్బంది దృష్టి సారించాలని డివిజనల్ అభివృద్ధి అధికారి లక్ష్మీపతి సూచించారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో నివసిస్తున్న ప్రజలకు సిబ్బంది పారిశుధ్యంపై అవగాహన కల్పించాలన్నారు. అదేవిధంగా ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. అలాగే వాల్మీకిపురం 3వ సచివాలయాన్ని తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ షబ్బీర్ అలీ, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు ఇంటర్వ్యూలు



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న ఐసీడీయస్ పీడీ ధనలక్ష్మి, కమిటీ సభ్యులు

మదనపల్లె : అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీపోస్టుల భర్తీ కోసం పారదర్శకంగా ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నామని ఐసీడీఎస్ ఇన్‌చార్జ్ పీడీ ధనలక్ష్మి తెలిపారు. మదనపల్లె, తంబళ్లపల్లె, బి.కొత్తకోట, వాల్మీకిపురం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాల పోస్టులకు మంగళవారం సబ్‌కలెక్టరేట్ సమావేశమందిరంలో ప్రభుత్వ మార్గదర్శకాలను అనుసరించి కమిటీలోని అధికారులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ ధనలక్ష్మి మాట్లాడుతూ..నవ సమాజ నిర్మాణం కోసం అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు చిత్తశుద్ధితో పనిచేయాలని సూచించారు. మదనపల్లె ఐసీడీయస్ ప్రాజెక్ట్ పరిధిలోని 4 మెయిన్ అంగన్‌వాడీ వర్కర్ ఖాళీలకు ఆరుగురు, ఒక మినీ అంగన్‌వాడీ వర్కర్ పోస్టుకు ఇద్దరు, అంగన్‌వాడీ హెల్పర్ ఒక ఖాళీకి ఒకరు హాజరయ్యారు. తంబళ్లపల్లె ప్రాజెక్ట్ పరిధిలోని 1 మెయిన్ అంగన్‌వాడీ వర్కర్ ఖాళీకి నలుగురు, 3 హెల్పర్ ఖాళీలకు ఇద్దరు, బి.కొత్తకోట ప్రాజెక్ట్ పరిధిలోని 1 మెయిన్ అంగన్‌వాడీ వర్కర్ పోస్టుకు 5 మంది, 1 మినీవర్కర్‌కు 1, 7 హెల్పర్ పోస్టులకు నలుగురు, వాల్మీకిపురం ప్రాజెక్ట్ పరిధిలోని 5 మెయిన్ అంగన్‌వాడీ వర్కర్ ఖాళీలకు 15మంది, 3 హెల్పర్ ఖాళీలకు నలుగురు ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. కార్యక్రమంలో సబ్‌కలెక్టరేట్ డిప్యూటీ తహసీల్దార్ గురుప్రసాద్, డాక్టర్.అనుపమ, సీడీపీఓలు సుజాత, భారతి,నాగవేణి, భాగ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

వరిలో యాజమాన్య పద్ధతులు పాటించాలి



వరి రైతులకు సూచనలిస్తున్న అధికారులు

పీలేరు రూరల్ : వరి సాగులో సరైన యాజమాన్య పద్ధతులు పాటించాలని జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ సహాయ సంచాలకులు ఎం.వి. శ్రీకాంత్, కలికిరి కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ వై. పీరూసాహెబ్ అన్నారు. మంగళవారం మండలంలోని శివరామపురం, దొడ్డిపల్లె గ్రామాల్లో వరి పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వరిలో ఆకునల్లి, ముడత నివారణకు రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు సూచించారు. నివారణకు ప్రొఫినోఫాస్ 2 మిల్లీలీటర్లను లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో రమాదేవి, వీఏఏ వనజ తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలి



అవగాహన కల్పిస్తున్న సీఐ మోహన్‌రెడ్డి

పీలేరు రూరల్ : ద్విచక్రవాహనదారులు విధిగా హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని సీఐ మోహన్ రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక కడప రోడ్డు మార్గంలో ద్విచక్రవాహన దారులకు రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ జిల్లా ఎస్పీ కృష్ణారావు ఆదేశాల మేరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రోజు రోజుకు రోడ్డు ప్రమాదాలు ఎక్కువుగా జరుగుతున్నాయని, హెల్మెట్ లేకపోవడంతో ఎక్కువుగా మరణాలు సంభవిస్తున్నాయని చెప్పారు. సెల్ ఫోన్‌లో మాట్లాడుతూ, మద్యంసేవించి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ నరసింహుడు పాల్గొన్నారు.

కలకడ: మండలంలో చిన్నారులు వాహనాలు నడిపినా, లైసెన్స్, వాహన రికార్డులు లేకుంటే చర్యలు తప్పవని ఎస్‌ఐ తిప్పే స్వామి హెచ్చరించారు. మంగళవారం వాహనదారులకు అవగాహన కల్పించారు.

స్కూల్ గేమ్స్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

పీలేరు రూరల్ : పీలేరు నియోజకవర్గ స్థాయి స్కూల్ గేమ్స్ పోటీల్లో వివిధ పాఠశాలల విద్యార్థులు తమ ప్రతిభ చూపినట్లు పీడీ నారాయణరెడ్డి తెలిపారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో జరిగిన పోటీల్లో అండర్ 17 బాలుర 1500 మీటర్ల పరుగుపందెంలో ఎ. శివకుమార్ (పీవీఎసీ, వాయల్పాడు), ఎస్. రాఘవ (ఏపీటీడబ్ల్యూఆర్, పీలేరు),100 మీటర్ల పరుగుపందెంలో ఎల్. రామచంద్రన్ (జీహెచ్‌ఎస్, పీలేరు), ఎస్. వేణు (గ్యారంపల్లె, ఏపీఆర్‌ఎస్), 100 మీటర్ల పరుగుపందెం బాలికల విభాగంలో కె. కీర్తన (జ్యోతీబాపూలే స్కూల్, పీలేరు), పి. ముత్యాలు (జ్యోతీబాపూలే స్కూల్, కలికిరి), అండర్ 14 బాలుర 100 మీటర్లలో డి. పవన్ (జీహెచ్‌ఎస్ కలికిరి), బి. రాకేష్ (జెడ్పీహెచ్‌ఎస్, జి.కొత్తపల్లె), 400 మీటర్ల పి. సతీష్ (జీహెచ్‌ఎస్, కలికిరి), బి. కిషోర్ (జెడ్పీహెచ్‌ఎస్‌బాలుర, కోటపల్లె), 100 మీటర్ల అండర్ 14 బాలికల సి. నవపల్లవి (ఎంజీపీ, కలికిరి), ఇ. హాసిని (జెడ్పీహెచ్‌ఎస్, చదివేవాండ్లపల్లె) మొదటి రెండు స్థానాలు సాధించినట్లు తెలిపారు.

ఘనంగా ‘నామట్టి.. నాదేశం’

రామసముద్రం: నామట్టి..నాదేశం, నేల తల్లికి వందనం కార్యక్రమంలో భాగంగా మట్టిని సేకరించి ర్యాలీ నిర్వహించినట్లు ఎంపీడీ నారాయణస్వామి, ఎంఈఓలు హేమలత, ఆంజనేయులు, తూర్పు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు హేమలత తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం స్థానిక తూర్పు పాఠశాల విద్యార్థులు దేశభక్తుల వేషధారణలో మట్టి చేత పట్టుకొని మేళతాళాల మధ్య స్థానిక పురవీధులలో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. స్థానిక చెక్‌పోస్ట్ కూడలిలో మానవహారం చేపట్టి స్వాతంత్ర పోరాటంలో ఆసువులు బాసిన స్వాతంత్ర సమరయోధులకు నివాళులర్పించారు. ప్రతి గ్రామ పంచాయతీలో నామట్టి నాదేశం అనే నినాదంతో 75 మొక్కలు నాటి స్వాతంత్ర సమరయోధులకు గుర్తుగా వాటిని పెంచి పోషిస్తున్నట్లు చెప్పారు.

పెద్దతిప్పసముద్రం: మేరా మిట్టి–మేరా దేశ్ కార్యక్రమాన్ని భక్తి శ్రద్ధలతో చేపట్టినట్లు ఎంపీడీఓ గిరిధర్ రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఈ నెలాఖరు వరకు జరిగే ఈ కార్యక్రమంలో భాగంగా మండలంలోని అన్ని గ్రామాల నుంచి పవిత్రమైన మట్టిని సేకరించి కలశంలో నింపి మండల కేంద్రంలోని ఈవోఆర్డీకి అందజేస్తామన్నారు. దేశం నలుమూలల నుంచి సేకరించిన మట్టిని ఢిల్లీలో నిర్మిస్తున్న అమరవీరుల స్మారక స్తూపంలో వినియోగిస్తారని తెలిపారు.

కలకడ : మేరా మట్టి–మేరా దేశ్ నినాదం దేశ గౌరవాన్ని పెంచుతుందని ఎంపీపీ శ్రీదేవి, కన్వీనర్ కమలాకర్‌రెడ్డి, ఎంపీడీఓ పరమేశ్వర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని బాలయ్యగారిపల్లె పంచాయతీలో అమృతకలశ యాత్ర నిర్వహించి పంచాయతీలోని వివిధ గ్రామాలనుంచి మట్టి, బియ్యంను మేళతాలాలతో, ప్రత్యేక పూజలు చేసి, సేకరించి స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో భద్రపరిచారు.

కర్ణాటక సీఎం అభినందన సభను

విజయవంతం చేద్దాం



మాట్లాడుతున్న జబ్బల శ్రీనివాసులు

మదనపల్లె : షెపర్డ్ ఇండియా ఇంటర్నేషనల్ 9వ వార్షికోత్సవ మహాసభ సందర్భంగా కర్ణాటకలోని బెల్గాంలో అక్టోబర్ 2, 3 తేదీల్లో సీఎం సిద్దరామయ్య అభినందన మహోత్సవాన్ని విజయవంతం చేయాలని ఏపీ కురుబ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జబ్బలశ్రీనివాసులు కోరారు. మంగళవారం పట్టణంలోని స్థానిక కురుబ, కురుమ సంఘం కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ.. గత ఏడాది షెపర్డ్ ఇండియా ఇంటర్నేషనల్ 8వ వార్షికోత్సవం అన్నమయ్య జిల్లా కురుబలకోటలో దేశంలోని 10 రాష్ట్రాల ప్రతినిధులతో కలిసి ఘనంగా నిర్వహించామన్నారు. ఈ ఏడాది బెల్గాంలో నిర్వహించే వార్షికోత్సవ మహాసభలకు రాష్ట్రం నుంచి పెద్దసంఖ్యలో కురుబ, కురుమ కులస్తులు హాజరై విజయవంతం చేయాలన్నారు. రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కురుబల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. సమావేశంలో మదనపల్లె, తంబళ్లపల్లె నియోజకవర్గ అధ్యక్షులు కప్పలరాజన్న, గుడేశ్రీనివాసులు, గుడిరామాంజులు, కదిరిరాజ్‌కుమార్, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌ను మరోసారి ఆశీర్వదించండి

పీలేరు : నిరంతరం ప్రజల సంక్షేమం కోరే రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని వైఎస్సార్ సీపీ నాయకుడు జి.వి. రాకేష్‌రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక రాజీవ్‌నగర్ కాలనీలో విస్తృతంగా ఇంటింటికీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వంలో అన్ని వర్గాలు అభివృద్ధే లక్ష్యంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. స్థానికులను సమ్యలు అడిగి తెలుసుకుని సత్వరం పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఎ.టి. రత్నశేఖర్‌రెడ్డి, వైస్ ఎంపీపీలు హరిత, చలపతి, వార్డు మెంబరు కళావతి, నాగరాజనాయక్, శ్రీనాథరెడ్డి, మునీర్, అరుణ, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

నిమ్మనపల్లె : అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం తహసీల్దార్ సీ.ఆర్. మంజులకు వినతిపత్రం సమర్పించారు. వేతనాలు పెంచాలని, గ్రాట్యుటీ అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న బకాయిలను వెంటనే చెల్లించాలని కోరారు.

విద్యార్థుల ర్యాలీ, మానవహారం



గుర్రంకొండలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

గుర్రంకొండ : మండల కేంద్రంలో తెలుగు జెడ్పీ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు ర్యాలీ, మానవహారం నిర్వహించారు. అజాదీకా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం దేశనాయకుల వేషధారణ, వారి చిత్రపటాలతో ప్రారంభమైన ర్యాలీ బస్టాండు వరకు సాగింది. అక్కడే మానవహారం ఏర్పాటు చేసి పంచప్రాణం ప్రతిజ్ఞ చేశారు. ఈసందర్భంగా దేశంలో ప్రాణత్యాగం చేసిన దేశ నాయకులను స్మరించుకొంటూ వారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ హెడ్మాస్టర్ మదన్‌మోహన్, పీడీ రమేష్‌బాబు, ఉపాధ్యాయులు త్రినాథ్, రెడ్డిసుబ్బులు, మాలతి, సుధాకర్, వెంకటలక్ష్మీ పాల్గొన్నారు.

బోధనా సామర్థ్యాలు పెంపొందేలా చర్యలు

నిమ్మనపల్లె : ఉపాధ్యాయుల్లో బోధన సామర్థ్యాలు పెంపొందేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఎంఈఓ నారాయణ తెలిపారు. మంగళవారం రెడ్డివారిపల్లె హైస్కూల్లో జరిగిన సీఆర్‌సీ సమావేశంలో ఎంఈఓ మాట్లాడుతూ.. విద్యాబోధనలో సాంకేతికతను అందిపుచ్చుకోవాలన్నారు. డిజిటల్ పద్ధతుల్లో మెరుగైన బోధన చేయాలన్నారు. ముఖ్యంగా సైన్స్, గణితం సబ్జెక్టులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలను పెంపొందించాలన్నారు. కోర్ సబ్జెక్టులు, కేస్‌స్టడీలపై మరింత దృష్టి పెట్టాలన్నారు. పాఠ్యాంశాల్లో బహుళ ఎంపిక ప్రశ్నలను సృష్టించాలన్నారు. అకడమిక్ కేలండర్ రూపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్యాంపస్ సెలక్షన్స్‌లో 40 మంది ఎంపిక



క్యాంపస్ సెలక్షన్స్‌లో ఎంపికైన విద్యార్థులు

మదనపల్లె సిటీ : స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీలో మంగళవారం జవహర్ నాలెడ్జ్ సెంటర్ ఆధ్వర్యంలో క్వెస్ కార్స్ లిమిటెడ్ సంస్థ క్యాంపస్ సెలక్షన్స్ నిర్వహించారు. ఇందులో 55 మంది విద్యార్థులు హాజరుకాగా అందులో 40 మంది ఎంపిక చేసినట్లు కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కృష్ణవేణి తెలిపారు. వీరికి నెలకు రూ.17,500 అందజేస్తారన్నారు. కార్యక్రమంలో జేకేసీ సమన్వయకర్త నమ్రత, అధ్యాపకులు విష్ణుప్రియ, మోహన్‌వల్లి, మోహన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

వెంకప్పకోట సచివాలయంలో ఆకస్మిక తనిఖీ

మదనపల్లె : మండలంలోని వెంకప్పకోట గ్రామ సచివాలయాన్ని డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ లక్ష్మీపతి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయ సిబ్బంది అటెండెన్స్ రిజిస్టర్‌ను పరిశీలించి పలురికార్డులను తనిఖీ చేశారు. జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేకు సంబంధించి ప్రగతిపై ఏఎస్‌ఎం, ఆశా కార్యకర్తలను ఆరా తీశారు. అక్టోబర్ 1 నుంచి నిర్వహించనున్న మెడికల్ క్యాంపులపై పలు సూచనలు చేశారు. ఎవరైనా సచివాలయ సిబ్బంది పనిపై బయటకు వెళ్లినప్పుడు మూమెంట్ రిజిస్టర్‌లో నమోదుచేసి వెళ్లాల్సిందిగా ఆదేశించారు. సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించి ప్రజలకు అందుబాటులో ఉంటూ, కార్యాలయానికి వచ్చే ప్రజలతో మర్యాదపూర్వకంగా నడుచుకోవాలన్నారు. యూనిఫాం తప్పనిసరిగా ధరించాలన్నారు.

జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు గ్యారంపల్లె విద్యార్థి



లోకేష్‌రెడ్డిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ బ్రహ్మాజీ

కేవీపల్లె : జాతీయ స్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు మండలంలోని గ్యారంపల్లె గురుకుల పాఠశాల పదో తరగతి విద్యార్థి ఎం. లోకేష్‌రెడ్డి ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ బ్రహ్మాజీ తెలిపారు. మంగళవారం పాఠశాలలో విద్యార్థిని అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్యారంపల్లె గురుకుల పాఠశాల స్కూల్ గేమ్స్ ఫెడరేషన్స్ ఆధ్వర్యంలో జరిగిన పోటీల్లో సత్తా చాటిన లోకేష్‌రెడ్డి అండర్ 17 విభాగంలో జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు వివరించారు. కార్యక్రమంలో పీఈటీ పురుషోత్తం, ఏటీపీ కిరణ్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం



ఆర్థిక సాయం అందిస్తున్న సర్పంచ్ డాక్టర్ హబీబ్‌బాషా

పీలేరు : వైఎస్సార్ బీమా కింద మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం అందించినట్లు సర్పంచ్ డాక్టర్ హబీబ్‌బాషా తెలిపారు. పీలేరు శివారు ప్రాంతంలోని శంకరాపురంకు చెందిన గంగాధరం మృతి చెందాడు. మృతునికి కుటుంబానికి వైఎస్సార్‌బీమా వర్తించడంతో తక్షణ సాయంగా మంగళవారం రూ.10వేలు మృతుని భార్య శైలజకు అందించారు. మిగతా రూ. 90 వేలు వారి వ్యక్తిగత ఖాతాకు జమ అవుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఈవో రెడ్డిప్రసాద్‌రెడ్డి, కాలేషా తదితరులు పాల్గొన్నారు.

సమష్టి కృషితో బాల్య వివాహాలను అరికడదాం

కేవీపల్లె : సమష్టి కృషితో బాల్య వివాహాలను అరికడదామని ఎంపీడీఓ ఉపేంద్రరెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బాల్యవివాహాలు నిర్మూలనపై మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాలతో జరిగే అనార్థాల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. ఎక్కడైనా బాల్య వివాహాలు చేస్తున్నట్లు తెలిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలని కోరారు. సీడీపీవో రాజమ్మ, ఎంఈవో రెడ్డిబాషా, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీఓ ఉపేంద్రరెడ్డి